క్లుప్తంగా

యోగా క్రీడాకారులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం అండర్ 18 యోగా జిల్లాస్థాయి పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలు శని, ఆదివారాల్లో కర్నూలులో జరగనున్నాయి. పది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. వీరిని డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణచౌదరి శుక్రవారం అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించి శ్రీకాకుళం క్యాంపస్‌కు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రమణమూర్తికి డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న రమణమూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: అరసవల్లి సమీపంలో ఉన్న సన్‌రైజ్ స్కూల్ కరస్పాండంట్ పొట్నూరు వెంకటరమణమూర్తి కొన్ని దశాబ్దాలుగా విద్యారంగంలో అందిస్తున్న సేవలకు గాను అమెరికాకు చెందిన 'డే స్ప్రింగ్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అరుకులో తాజాగా జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆమోస్ జేమ్స్ డాక్టరేట్‌ను మూర్తికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణరావు, మోహనరెడ్డి, పి.శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ కార్మికులకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు అందిస్తున్న కమిషనర్, దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలవీధిలో విజయదుర్గా అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా 108 మంది మున్సిపల్ మహిళా కార్మికులకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. ఊర్వశీ సిల్క్స్ అధినేత దేవరశెట్టి ప్రదీప్, కాంచనలత దంపతులు సౌజన్యంతో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ సుధీర్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి సహస్ర పుష్పార్చన నిర్వహించామని అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, ఫణికుమార్ శర్మ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు 340 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో 340 అర్జీలు స్వీకరించినట్లు కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాదరావు తెలిపారు. 1 నుంచి 25 డివిజన్ల పరిధిలో సమస్యలపై వినతులు స్వీకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణపతిరావు, మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జ్యోతి

శ్రీకాకుళం అర్బన్: నేషనల్ యోగాసన స్పోర్ట్ ఫెడరేషన్ (ఎన్‌వైఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఇటీవల శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన గుంట జ్యోతి ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలు ఈ నెల 5, 6, 7 తేదీల్లో కర్నూలులో జరగనున్నాయి. ఈ సందర్భంగా జ్యోతిని ఎమ్మెల్యే గొండు శంకర్, పీఎన్ కాలనీకి చెందిన యోగా గురు నాగలక్ష్మి అభినందించారు.

రూ.కోట్లలో అప్పులు.. వ్యాపారి పరార్!

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఓ ప్రముఖ కంపెనీ డీలర్‌గా ఉన్న ఓ వ్యక్తి పలువురి వద్ద వడ్డీలకు కోట్ల రూపాయలు అప్పులు తీసుకుని వాటిని తీర్చలేక కుటుంబంతో సహా పరారయ్యాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఈ విషయం నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇటీవల ఇంటిని విక్రయిస్తానని ఓ వ్యాపారి వద్ద కొంత టోకెన్ సొమ్ముగా తీసుకుపోయినట్లు చర్చ నడుస్తోంది. ఇలా అందరి వద్దా రూ. 10 కోట్లకు పైగానే అప్పులు వాడి పరారయ్యాడని బాధితులు అంటున్నారు.


దేవుడి పేరుతో రాజకీయమా?



సూపర్‌సిక్స్ అమలు చేయడం చేతకాక లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసి లబ్ధి పొందాలనుకుంటే వెంకన్న స్వామి క్షమించడు. డైవర్షన్ పాలిటిక్స్‌తో పరిపాలన చేద్దామంటే ప్రజలేం అంత అమాయకులు కాదు.

– మామిడి శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ తూర్పుకాపు సంఘం అధ్యక్షుడు

కుతంత్రాలకు చెక్



తిరుమల లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు అండ్‌కో కుట్రలను చిత్తు చేస్తూ సుప్రీంకోర్టు స్వతంత్ర సిట్ ఏర్పాటుకు ఆదేశించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సుప్రీం ఆదేశాలు కూటమి పాలకులకు చెంపపెట్టు వంటివన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. – సాక్షి నెట్‌వర్క్

న్యాయమే గెలుస్తుంది



లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందన్న టీడీపీ తప్పుడు ప్రచారానికి సుప్రీంకోర్టు కళ్లెం వేసింది. అంతిమంగా న్యాయమే గెలుస్తుంది.

– అంధవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ కళింగవైశ్య విభాగం అధ్యక్షుడు

అబద్ధాల చంద్రబాబుకు ఎదురుదెబ్బ



తిరుపతి లడ్డూ వివాదంపై సీఎం చంద్రబాబుకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. లడ్డూ వివాదంలో సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించడం అంటే చంద్రబాబు ఆరోపణలు తప్పు అని చెప్పినట్లే భావించవచ్చు.

– దుంపల లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ కళింగ సంఘం అధ్యక్షుడు

చంద్రబాబుకు చెంపపెట్టు



వెంకటేశ్వర స్వామి ప్రసాదంపై తప్పుడు ప్రచారాలు చేయడంతో ప్రపంచంలో ఉన్న హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. సుప్రీం కోర్టు నిర్ణయం చంద్రబాబుకు చెంపపెట్టు.

– పేడాడ శ్రీరామమూర్తి, న్యాయవాది, ధవళపేట, జి.సిగడాం మండలం

చంద్రబాబుకు ఎదురుదెబ్బ



అతి పవిత్రమైన తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదం వివాదంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వం చేసిన దుష్ప్రచారంపై సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

– గొర్లె శ్రీరాములునాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు, లావేరు మండలం

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి..



పవిత్రమైన వెంకన్న స్వామి లడ్డూపై మోసకారి సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఇప్పటికైనా వెనక్కి తీసుకోవాలి. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకొచ్చిన బాబుకి సుప్రీంకోర్టు నిర్ణయం చెంపచెల్లుమనిపించేలా ఉంది.

– ఎంపీ స్వరూప్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

కాలువలు కలేనా?



కాలువ లేక రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

- భారతీనగర్‌లో పందులు, కుక్కలు, దోమల స్వైర విహారం
- తీవ్ర దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్పొరేషన్ కంటే మారుమూల ప్రాంతాలే నయమని శ్రీకాకుళం నగరంలో కొన్ని ప్రాంతాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. రిమ్స్ ఆస్పత్రి సమీపంలోని భారతీనగర్ ప్రాంతంలో కాలువలు నిర్మించకపోవడంతో నిత్యం రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. ఇటువైపుగా రాకపోకలు సాగించేవారు ద్విచక్రవాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ దేవాలయాల సమూహం ఉండటంతో భక్తులంతా ముక్కులు మూసుకుని



మురుగునీటిలో పందులను చూపిస్తున్న స్థానికుడు

వెళ్లాల్సి వస్తోంది. కాలనీకి సమీపంలోనే ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలున్నాయి. విద్యార్థులంతా ఈ మురుగు మీదుగానే స్కూళ్లకు, కాలేజీలకు రాకపోకలు సాగిస్తుంటారు. సాయంత్రమైతే చాలు దోమలు స్వైర విహారం చేస్తూ రోగాలకు కారణమవుతున్నాయి.

ఈ రోడ్డుకు సమీపంలో భారీ అపార్టుమెంట్లు నిర్మించినా కాలువల నిర్మాణాలు చేపట్టపోవడంతో అక్కడి మురుగునీరంతా రోడ్లపైకి వచ్చేస్తోంది. ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యే, సచివాలయ, కార్పొరేషన్ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండాపోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు చొరవ చూపి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భయమేస్తోంది..



మా ఇంటికి మూడు వైపులా కాలువలు లేక మురుగునీరంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. రాత్రి, పగలు అని తేడా లేకుండా పందులు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇంటికి చేరాలంటే భయమేస్తోంది. తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలి.

– డాక్టర్ ధర్మాన లక్ష్మీనారాయణ, భారతీనగర్, శ్రీకాకుళం

పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలి



సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

రణస్థలం: వ్యవసాయ పంప్ సెట్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలని, విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనను ఉపసంహరించాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రణస్థలం సచివాలయం దగ్గర రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ రైతులతో కలిసి శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కష్టాల్లో ఉన్నారని, రూ. 20 వేలు పెట్టుబడి సాయం రైతుల ఖాతాలో వేయాలని అన్నారు. గత సంవత్సరం నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారం వెంటనే చెల్లించాలని, సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలని, తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేసి శివారు భూములకు సానీరు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే రూ. రెండు లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేయాలని, భూ యాజమాని సంతకం నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, జిల్లాలో కొబ్బరి ఫార్కు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు ఇజ్జురోతు రమణ, చోడిశెట్టి ఆదినారాయణ, పిన్నింటి అప్పలనాయుడు, రమణ, మహంతి సత్యం, పిన్నింటి గోవింద పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన డీసీఆర్బీ సీఐ



ఎస్పీకి పూలమొక్క బహూకరిస్తున్న డీసీఆర్బీ సీఐ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్: విశాఖపట్నం వీఆర్ నుంచి జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో (డీసీఆర్బీ) సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.శ్రీనివాసరావు శుక్రవారం విధుల్లో చేరారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో బాలల హక్కుల సంరక్షణకు సమావేశాలు నిర్వహించి పటిష్ట చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి బాల కార్మిక వ్యవస్థ పూర్తిస్థాయిలో నిర్మూలించేలా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణాధికారి పి.వి.రమణ, సంక్షేమ సమితి కమిటీ చైర్మన్ యు.శ్రీలక్ష్మి, మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుమారి పూజలు



పూజలు చేస్తున్న బాలకుమారిలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరాన ఉన్న బాలాత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా కుమారి పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో 21 మంది బాలికలను అమ్మవారి స్వరూపిణులుగా భావించి ప్రత్యేక పూజలు చేశారు. మొండేటివీధిలోని లలితా దేవి ఆలయంలో షిరిడిసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరణ చేసేందుకు శ్రీనివాస చక్రవర్తి, పూర్ణకుమారి దంపతులు పట్టు వస్త్రాల సారెను సమర్పించారు. బ్రిడ్జి రోడ్డులోని దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని పసుపుకొమ్ములతో అలంకరణ చేశారు.

బుడుమూరులో సామూహిక కలశ పూజలు



ఎచ్చెర్ల: సామూహిక కలశ, కుంకుమార్చనల్లో భక్తులు



రణస్థలం: ప్రత్యేక ఆకర్షణగా దీపారాధన

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు గ్రామంలోని దుర్గాదేవి అమ్మవారికి శుక్రవారం సామూహిక కలశ పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జె.ఆర్.పురంలో దీపారాధన

రణస్థలం: జె.ఆర్.పురం దుర్గాదేవి మండపంలో సామూహిక కుంకమ పూజలు జరిగాయి. అనంతరం నిర్వహించిన దీపారాధన ఆకట్టుకుంది.

డిగ్రీ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలోడిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 7, 8 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు శుక్రవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను కొన్ని కోర్సుల్లో స్వల్పంగా మిగిలిన మిగులు సీట్ల భర్తీకిగాను స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. ఆలస్య అపరాధ రుసుం చెల్లించి ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు కూడా స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్‌కాపీలు, ఆధార్‌కార్డు, పాస్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

నిర్మాణాలు ఆపేయాలని నోటీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం పంచాయతీ దుప్పలవలస గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 97/10, 11లో చెరువు ఆక్రమించి, కొందరు నిర్మాణాలు చేపడుతున్నారని జిల్లా కలెక్టర్‌కు మీకోసంలో ఆగస్టు ఎనిమిదో తేదీన జి.మహేష్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ నివేదిక ఇవ్వాలని ఎచ్చెర్ల రెవెన్యూ అధికాలకు సూచించింది. రెవెన్యూ అధికారులు సైతం ప్రాథమికంగా చెరువు స్థలం ఉన్నట్లు గుర్తించారు. దీంతో నిర్మాణాలు నిలుపుదల చేయాలని శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ నిర్మాణదారులకు నోటీసులు అందజేసింది. ఈ అంశంపైనే సత్తారు గోపి అనే వ్యక్తి హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేశారు.

కొత్త కలెక్టరేట్ పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులు సత్వరమే పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వికసిత్ ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్ర–2047 వర్క్ షాప్ అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న జనవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులు మీదుగా భవనాలను ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్, గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల కేంద్రాలు ఏర్పాటు చేయండి



తల్లిపాల కేంద్రాలపై ఆరా తీస్తున్న గొండు సీతారాం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు ఇతర బస్‌స్టేషన్లలోనూ తల్లిపాలు పట్టే ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ నేతృత్వంలో జిల్లాలో గల వివిధ ఆర్టీసీ డిపోల మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సుప్రీం కోర్టు నిబంధనలు అనుసరించి జిల్లాలో ఇప్పటి వరకు కాంప్లెక్స్‌ల్లో ఎన్ని తల్లిపాలు కేంద్రాలు ఏర్పాటు చేశారు? ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారో అడిగి తెలుసుకున్నారు. బస్ పాస్‌లపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతిశ్రీ, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి, సభ్యులు గన్నెప్పడు, వి.రమణ మూర్తి, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి.రమణ, ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, అధికారులు శ్రీనివాస్, నాయుడు, పి.ఓ.ఐ.సి.మెట్ట మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బాలా త్రిపుర సుందరిదేవిగా విజయదుర్గ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాల వీధిలో కొలువైన విజయదుర్గా అమ్మవారు శుక్రవారం బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, ఆరవెల్లి ఫణికుమార్ శర్మల నేతృత్వంలో అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, సహస్ర పుష్పార్చన, సహస్ర కుంకుమార్చనలు జరిగాయి.

విధుల్లో చేరిన డీటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సూపరింటెండెంట్‌గా పి.శ్రీనివాసరావు, సివిల్ సప్లయ్ డీటీగా ఎస్.చక్రవర్తి విధుల్లో చేరారు. ఇప్పటి వరకూ పనిచేసిన వీవీఎస్ఎస్ రాజు, షరీఫ్‌లను జిల్లా సివిల్ సప్లయ్ విభాగానికి బదిలీ చేశారు.

సెలవుల్లో తరగతులపై ఫిర్యాదు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పలు కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కాలేజీలు సెలవుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నాయని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి శుక్రవారం జిల్లా ఆర్ఐఓ ప్రగడ దుర్గారావుకు ఫిర్యాదు చేశారు. అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

సంతవురిటిలో పొలం పిలుస్తోంది

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలకు తెగుళ్ల సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సంతవురిటి అగ్రికల్చర్ అసిస్టెంట్ అలుగోలు లక్ష్మీనారాయణ, సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేశ్వరావు, ఉపసర్పంచ్ చందనాల గణపతి, చందనాల రంగారావు ఉన్నారు.

గ్రామసభల ద్వారా పనుల గుర్తింపు

జి.సిగడాం: గ్రామ సభల ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి మౌలిక సదుపాలు కల్పించాలని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షులు పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. దవళపేట గ్రామంలో సర్పంచ్ వడిశ మహేశ్వరరావు అధ్యక్షతను శుక్రవారం గ్రామ సభ నిర్వహించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలు, చెరువులు, రోడ్డు పనుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఉపసర్పంచ్ పేడాడ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి స్వాతి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా టెట్ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాల ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో రెండో రోజైన శుక్రవారం నిర్వహించిన ఏపీ టెట్– 2024 పరీక్ష సజావుగా జరిగింది. మొదటి షిఫ్టులో 100 మందికి 91 మంది, రెండో షిఫ్టులో 100 మందికి 89 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

ఒకటో డిపో మేనేజర్‌గా అమరసింహుడు



శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్‌గా హనుమంతు అమరసింహుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన మల్లికార్జునరాజు విశాఖపట్నానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా అమరసింహుడు మాట్లాడుతూ గతంలో ఇదే డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. డిపో అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. దసరా రద్దీకి తగ్గట్లు బస్సులు నడిపేందుకు జిల్లా ప్రజారవాణా శాఖ అధికారి విజయ్‌కుమార్ సూచనల మేరకు బస్సులను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పండగ అనంతరం తిరుగు ప్రయాణానికి బస్సులు సిద్ధం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో హరిహరరావుతో కార్యాలయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ అధికారిగా సీపాన హరిహరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఆర్.రమాదేవి విశాఖపట్నం బదిలీ అయ్యారు. పొందూరు నుంచి కొత్త ఎంపీడీవో ఒక్కడికి వచ్చారు. ఈయనకు పరిపాలన అధికారి పీవీఎస్ రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ కిల్లారి నారాయణరావు, సిబ్బంది అభినందించారు.

డీటీసీగా విజయసారథి



శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం డీటీసీగా ఏ.విజయసారథి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన చంద్రశేఖరరెడ్డి బదిలీపై కడపకు వెళ్లారు. →

బాధ్యతలు స్వీకరిస్తున్న విజయసారథి